# పిస్తోలు

జగన్నాధం నా బెస్ట్‌ఫ్రెండ్ ఆఫీసుపని మీద హైద్రాబాద్ వచ్చినపుడల్లా నా బస వాడి ఇంట్లోనే సీత నాకు వరుసకు చెల్లె లవుతుంది సీతే జగన్నాధం శ్రీమతి అవ్వటంవల్ల నాకు వాడింట్లో మొహ మాటంకూడా ఏమీ లేదు

జగన్నాధానికి ముగ్గురు పిల్లలు నా దగ్గర పిల్లుల్లా వున్నా, పేరెంట్స్ దగ్గర పులుల్లా వుంటారని విని నమ్మేవాణ్ణి కాదు నేనిచ్చే బొమ్మల్ని చూసి నామీద ఇష్టపడుతున్నారని అనుమానం వచ్చి క్రిందటిసారి ఏమీ ఇవ్వలేదు అయినా నా చుట్టూ తిరిగి గంటల్ని నిముషాల్లా మార్చారు

ఈసారి మళ్ళీ ఓ వారంపాటు హైద్రా బాద్ ప్రయాణం పడింది రైలు దిగి, ఆటోను అబిడ్స్‌లో ఆపి బొమ్మలు కొన టానికి టాయ్ ఎంపోరియమ్‌లో దూరేను నల్లగా తళతళలాడుతూ బొమ్మపిస్తోలు నా కంట పడింది దొంగలు దడుచుకునేలా నిజం పిస్తోలులా వుంది కొన్నాను దీని ముందు మిగతావన్నీ దిగదిడుపులావున్నా, ఒకటే ముగ్గురకు ఇవ్వటం సాధ్యంకాదు కాబట్టి ఇంకో రెండు బొమ్మల్నికూడా కొన్నాను

జగన్నాధం ఇంట్లో కుశలప్రశ్నల తరు వాత సూట్‌కేస్‌నుండి పిస్తోలునూ, రెండు బొమ్మల్నీ బైటకు తీసి టేబుల్‌మీద పెట్టాను ముగ్గురి కళ్ళు పిస్తోలుమీదే వున్నాయి డైలమాలో పడ్డాను

—నిజంగా పిస్తోలుముందు బొమ్మలు వెలవెల బోతున్నాయి

పిస్తోలు ఎవ్వరికివ్వాలో చెప్పమన్న ట్లుగా సీత వంక చూసేను సీత జగన్నాధాన్ని చూసింది జగన్నాధం నన్ను చూశాడు

మళ్ళీ డైలమాలో పడ్డాను

—వంకీ కత్తి అంచు పదునులా చక్కటి ఆలోచన మెరుపులా నా మెదడులో తళుక్కుమంది

సిగరెట్ వెలిగించి, రెండు సార్లు గట్టిగా పొగపీల్చి మాట్లాడేను—

"మీ ముగ్గురిలో ఎవరు ఎక్కువ బుద్ధి మంతులో నాకు తెల్సు క్రిందటిసారి వచ్చి నపుడు కనిపెట్టేశాను నేను ఒకళ్ళకు ఇచ్చిన తర్వాత, మిగతా ఇద్దరికీ నామీద కోపం రాకూడదు"

గది నిశ్శబ్దంగా వుంది మనుషులు వున్న ఇంట్లో—రాత్రుళ్ళు నిద్రవేళతప్ప, అంత నిశ్శబ్దాన్ని నా జీవితంలో ఎరుగను మళ్ళీ మాట్లాడాను

"మీ అమ్మమాట ఎవరు ఎక్కువగా వింటారో మీ అమ్మ చెప్పినట్లుగానే ఎవరు ఎక్కువగా నడుచుకుంటారో వాళ్ళకే పిస్తోలు మరి ఇవ్వనా ?"

నన్నూ, జగన్నాధాన్నీ, సీతనూ, పిస్తోలునూ మళ్ళీ మార్చిమార్చి చూసి ముగ్గురూ కోరస్‌గా తుపాకులు పేల్చి నట్లుగా అన్నారు—

"అలా అయితే అంకుల్ పిస్తోలు డాడీకే! డాడీకే ఇచ్చెయ్ పిస్తోలు"

—వి ఆర్ శశిధరుడు